క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాల్లో కాంట్రాక్టు కమ్ కౌన్సెలింగ్ తరగతులు బోధించేందుకు కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం శ్రీనివాస్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.సంజీవయ్య సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. బోధన అనుభవం, పీహెచ్‌డీ, నెట్, స్లెట్, పీజీ సంబంధిత సబ్జెక్టుల్లో 55శాతం మార్కులు ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆన్‌లైన్ బిఆర్ఏఓయూ .ఏసీ. లో ఈనెల 10వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం విశ్వవిద్యాలయం పోర్టల్, సంబంధిత అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

కుల బహిష్కరణ చేస్తామని బెదిరింపులు

హసన్‌పర్తి : కులంలో అక్రమాలు, భూ కబ్జాలను ప్రశ్నించినందుకే తనను కుల బహిష్కరణ, జరిమానా విధిస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని మండలంలోని జయగిరికి చెందిన తాళ్లపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఎర్రగట్టు గుట్ట సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘానికి సంబంధించిన భూమిని మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేస్తే అందుకు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సహకరించారని ఆరోపించాడు. సంఘంలో ఉన్న డబ్బుల్లో కూడా అక్రమాలు జరిగినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇందుకు తనతోపాటు మరికొంత మంది సభ్యులపై జరిమానా విధించారని తెలిపారు.

అరుణోదయ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఎన్నిక



హసన్‌పర్తి : గోపాలపురంలోని అరుణోదయ వెల్ఫేర్ సొసైటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లారి మధుసూదన్, ప్రధాన కార్యదర్శిగా జాటోత్ రతన్‌సింగ్, కోశాధికారిగా ఉప్పుల తిరుపతి ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్‌లు డాక్టర్ మంజుల, శ్రీనివాసచార్య, ప్రద్యుమ్నలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు బొట్ల ఆంజనేయులు, మాజీ ప్రధానకార్యదర్శి ఇనుగాల సుదర్శన్, మాజీ కోశాధికారి తిరుపతి రెడ్డి, మాజీ గౌరవ అధ్యక్షులు రాజారాంనాయక్, మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నామోజు శ్రీనివాస్

ఖిలా వరంగల్ : టీచర్ల సర్దుబాటు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ కోరారు. సోమవారం కరీమాబాద్‌లోని ప్రభుత్వ సహాయక వెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వివిధ పాఠశాలలో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందని చెప్పారు. ఈ నెలలో ఎస్ఏ-1 మూల్యాంకన పరీక్షలు ఉన్నాయని, వెంటనే ఉపాధ్యాయుల సర్దుబాటును త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సోమశేఖర్, రామరాజు, నరసింహారావు, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

హసన్‌పర్తి : మండలంలోని వివిధ పాఠశాలల నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో యూత్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్ఎంఎంఎస్ సాధించాలన్నారు. ప్రతి ఏడాది రూ.12 వేల చొప్పున విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తామన్నారు. యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రవీందర్, మల్లికార్జున్ హెచ్ఎం. సుమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



సోమిడి గ్రామశివారులో ఇళ్ల మధ్య ఉన్న తుమ్మ చెట్లు



ప్రశాంత్‌నగర్ కాలనీలో మురుగు కాల్వలు లేక ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీరు

- అధ్వానంగా డ్రెయినేజీలు
- ఎక్కడ చూసినా మురుగునీరే
- విజృంభిస్తున్న దోమలు
- నివారణ చర్యలు శూన్యం

కాజీపేట : పట్టణంలో చెత్త తొలగింపు, డ్రెయినేజీల శుభ్రం వంటి పనులు సక్రమంగా జరగడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డ్రెయినేజీల్లో పూడిక పేరుకపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు చెత్త, వర్షపు నీటితో మురికికుంతలుగా మారుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది తక్కువగా ఉండటం..కాలనీలు ఎక్కువగా ఉండడంతో సిబ్బంది సకాలంలో పనులు చేయలేకపోతున్నారనే విషయం పాలకవర్గానికి తెలిసినా పట్టించుకున్న దాఖలాలు లేవంటున్నారు. పారిశుద్ధ్య ప్రచారానికి ఇచ్చే ప్రాధాన్యాన్ని అధికారులు పనులు చేయించడంలో ఆసక్తి కనబర్చడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షపు జల్లులకు కాల్వలు నీటితో నిండుకుండలా మారాయి. చెత్తా, చెదారం కాల్వల్లో ఉండటంతో కుళ్లిపోయి కంపువాసన వెదజల్లుతోంది. దీంతోపాటు ఈగలు, దోమల బెడద కాలనీల్లో విపరీతంగా పెరిగిపోయింది. సాయంత్రం అయిందంటే చాలు తలుపులు బిగించుకుని ఇంట్లోనే కూర్చోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాడలేని ఫాగింగ్

దోమల నివారణకు కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు పని చేయకపోవడంతో మూలకు పడేశారు. పెరిగిన ఇంధనం ఖర్చులను దృష్టిలో ఉంచుకుని అధికారులు యంత్రాలను అటకెక్కించారు. కాలనీల్లో ఫాగింగ్ చేయడం మరచిపోవడంతో దోమల బెడద తీవ్రమైంది. వీటి నివారణకు ఇళ్లలో కాయిల్స్, లిక్విడ్ సీసాల వినియోగానికి ఒక్కో కుటుంబం నెలకు రూ.200- 300లు ఖర్చు చేస్తుంది. ఈ లెక్కన పట్టణంలో పాతిక వేల కుటుంబాలుండగా ప్రతీ నెలా రూ.2.5లక్షల వరకు దోమల నివారణకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి ప్రజలు ఇళ్లలో ఎదుర్కొంటున్న దోమల సమస్యల నివారణకు ఫాగింగ్‌తోపాటు పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కాల్వలను శుభ్రం చేయాలి



పట్టణంలో ఉన్న మురికి కాల్వలను ప్రత్యేక సిబ్బందితో యుద్ధ ప్రతిపాదికన శుభ్రం చేయించాలి. కాల్వగట్ల వెంట ఉన్న గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించాలి. వర్షంనీరు కాల్వల ద్వారా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి.
– పాము రాజేశ్, కాజీపేట

ఈగలు, దోమల బెడద ఎక్కువ



కాజీపేటలో ఈగలు, దోమల బెడద అధికంగా ఉంది. చీకటి పడిందంటే చాలు దోమలతో వేగలేకపోతున్నాం. డివిజన్లలో ఫాగింగ్ చేయకపోవడంతో సమస్య తీవ్రత మరింతగా పెరుగుతుంది. అధికారులు నివారణ చర్యలు చేపట్టాలి.
– మహమూద్, కాజీపేట

ఉద్యమంలో ఆనవాళ్లులేని ఆర్ఎస్ఎస్

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : స్వాతంత్ర్య ఉద్యమంలో ఆనవాళ్లు లేని ఆర్ఎస్ఎస్ నూరేళ్ల ఉత్సవాలు జరపడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు విమర్శించారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో జిల్లా సమితి సమావేశం రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రావు పాల్గొని మాట్లాడుతూ మత విద్వేష పునాదుల మీద నడుస్తూ హిందు మతోన్మాదంతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఆర్ఎస్ఎస్ ది అధికార కాంక్ష తప్ప చరిత్రలో ప్రజల గురించి ఏనాడు పనిచేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. త్యాగాల చరిత్రలో కమ్యూనిస్టులు ముందున్నారని, స్వార్థ చింతనతో ఆర్ఎస్ఎస్ అధికారమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు కె.భిక్షపతి, టి.భిక్షపతి, ఎం.ఎల్లేష్, సదాలక్ష్మి, స్టాలిన్, రాములు, లక్ష్మణ్, ఎం.భిక్షపతి, ఓదేలు, సదానందం, వెంకట్రాజం,శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఎమ్మెల్యే చేయూత



గణేశ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా : మెడిసిన్ సీటు సాధించిన 4వ డివిజన్ పెద్దమ్మగడ్డకు చెందిన విద్యార్థి ఆర్మల గణేశ్‌కు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో సోమవారం గణేశ్‌ను ఎమ్మెల్యే సన్మానించారు. ఉన్నత విద్యకు ఆర్థికభారం అడ్డుకాకూడదని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గణేశ్‌కు సూచించారు.

రవికుమార్‌కు ఉత్తమ సపోర్టివ్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న రవికుమార్

హన్మకొండ : హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెనిశెట్టి రవికుమార్ బెస్ట్ సపోర్టివ్ టీచర్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న ఏపీ రాష్ట్రంలోని వైఎస్ఆర్ కడప జిల్లా కడపలోని కేఎస్ఆర్ఎం కళాశాలలో గ్లోబల్ జ్ఞాన అకాడమీ ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్ అవార్డుల కార్యక్రమం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన 32 మంది ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించారు. ఇందులో టాప్ 12 మందిలో రవికుమార్‌కు 5వ స్థానం పొంది జాతీయస్థాయి ఉత్తమ సపోర్టివ్ టీచర్ అవార్డు అందుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత విలువలు పెంపొందించడం, ఏకో క్లబ్ ద్వారా మట్టి వినాయకుల తయారీ పంపిణీ చేయడం, విద్యార్థులకు పరీక్ష మెటీరియల్ అందించడం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న రవికుమార్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పోతన సాహితీ పీఠం అధ్యక్షుడు శంకర్, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ గుప్తా, జ్యూరీ సభ్యుడు సమతా నాయుడు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



హసన్‌పర్తి : పలివేల్పుల నుంచి హసన్‌పర్తి వైపునకు ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్ లీకేజీ అయింది. ఎస్సారెస్పీ కాల్వ వద్ద పైపులైన్ దెబ్బతినడంతో నీరు విడుదల చేసినప్పుడు తాగునీరు కాల్వలోకి వృథాగా పోతుంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు చెబుతున్నారు.

'మల్లికాంబ కేంద్రం సేవలు అభినందనీయం'



పిల్లలు, మల్లికాంబ నిర్వాహకులు, సిబ్బందితో అంపశయ్య నవీన్

హన్మకొండ అర్బన్ : శారీరక వైకల్యం గల పిల్లలకు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, ప్రముఖ తెలుగు రచయిత అంపశయ్య నవీన్ అన్నారు. ప్రపంచ సెరిబ్రల్ పాల్సీ దినోత్సవం సందర్భంగా నగరంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడుతూ సెరిబ్రల్ పాల్సీ అనేది కదలికను ప్రభావితం చేసే శారీరక వైకల్యమన్నారు. ఇది ఉన్న చాలా మంది దృష్టి, వినికిడి సమస్యలతో బాధపడతారని, ఇలాంటి పిల్లలకు సేవలు అందిస్తున్న మల్లికాంబ నిర్వాహకులు, సిబ్బందిని అభినందించారు. అనంతరం అంపశయ్య సతీమణి అనసూయ పుట్టిన రోజు సందర్భంగా పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శశి కిరణ్, మల్లికాంబ సంస్థ నిర్వాహకులు బండ రామలీల, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు టైర్ పేలి ఒకరికి తీవ్రగాయాలు

- పలువురికి స్వల్ప గాయాలు

ఖిలా వరంగల్ : సీట్ల పరిమితి మించి ఓవర్‌లోడుతో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు ఆకస్మాత్తుగా టైర్ పేలి ఒకరికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం మధ్యాహ్నం నక్కలపల్లి శివారులో చోటు చేసుకుంది. ప్రయాణికుల కథనం ప్రకారం.. వరంగల్ నుంచి అన్నారం షరీఫ్‌కు సోమవారం మధ్యాహ్నం 65 నుంచి 70 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బయల్దేరింది. బస్సు నక్కలపల్లి శివారు మలుపు వద్దకు చేరుకోగానే ఆకస్మాత్తుగా టైర్ పేలిపోయింది. దీంతో ఒక్కసారి బస్సు అదుపు తప్పి ప్రయత్నంలో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో బస్సులోని ప్రయాణికులంతా ఒకరిపై ఒకరు పడిపోయారు. ఇందులో కల్లెడ గ్రామానికి చెందిన దాసరి రవికి తీవ్రగాయాలు కాగా అతడి భార్య సంధ్య, కుమార్తెకు గాయాలయ్యాయి. మరో 25 మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను వరంగల్ రైల్వేస్టేషన్‌కు చెందిన 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలియగానే మామునూరు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించినట్లు తెలిసింది.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



తిరుపతియాదవ్ కుమార్తెకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని అందజేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు



కాజీపేట రూరల్ : బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని సెరికల్చర్ విభాగంలో పార్ట్‌టైం అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ మెడుదల తిరుపతి యాదవ్ ఇటీవల మరణించాడు. పార్ట్‌టైం అధ్యాపకులు కలిసి తిరుపతి యాదవ్ కుటుంబానికి సోమవారం రూ.60 వేల ఆర్థికసాయం అందజేశారు. వరంగల్ దేశాయిపేటలో నివాసం ఉంటున్న తిరుపతి యాదవ్-రమాదేవి, కుమారుడు ఫణీంద్ర, కుమార్తె సాహితిని కలిసి పార్ట్‌టైం అధ్యాపకులు ఆర్థికసాయం అందజేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో జమజేసి వా రికి అందజేశారు. కేయూ పార్ట్‌టైం అధ్యాపకులు భిక్షపతి, రాంబాబు, సత్యనారాయణ, రా జిరెడ్డి కుటుంబ సభ్యులకు డిపాజిట్ పత్రంను అందజేశారు.

కాజీపేట రూరల్ : కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ బూడిదిగడ్డలో ఆదివారం కురిసిన వర్షానికి నద్దునూరి కళావతి కుటుంబం ఉంటున్న ఇల్లు కూలింది. వర్షానికి కళావతి ఇల్లు కూలిన విషయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వివరించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి కాజీపేట తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తహసీల్దార్ వెంటనే స్పందించి ఆర్ఐ శివను పంపించి అక్కడి పరిస్థితి వివరాలను తెలుసుకొని ప్రభుత్వం తరపున బాధిత కుటుంబానికి రూ.7,500, 50 కిలోల బియ్యం అందజేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో మాట్లాడి బాధిత కుటుంబానికి కూలిన ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయిస్తామని అన్నారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్, దొంగల కుమార్‌యాదవ్, భానుచందర్, స్వామి, నాగేష్, సంజీవ, దేవయ్య వాసు, తదితరులు ఉన్నారు.

షరతులు లేకుండా కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు



ఏనుమాముల మార్కెట్ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న చందర్‌రావు

వరంగల్ చౌరస్తా : రాష్ట్రంలోని రైతుల పత్తి, మొక్కజొన్న పంటలను ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ధరలతో కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు కోరారు. మొత్తం పంటలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలైన సీసీఐ, మార్క్‌ఫెడ్‌లను రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ అధికారులను తెలంగాణ రైతు సంఘం నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందర్‌రావు మాట్లాడుతూ రైతుల పంటలకు డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీటు ప్లస్ 50 శాతం అదనపు మద్దతు ధరలతో ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చట్టం చేసి అమలు చేయాలన్నారు. గత ఐదేళ్ల నుంచి ఢిల్లీ సరిహద్దులో వందలాది మంది రైతులు ప్రాణత్యాగాలు చేస్తే దిగివచ్చిన డిమాండ్లను పరిష్కరిస్తామని ఇప్పటి వరకు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. టీఆర్‌ల పేరుతో తిరిగి సీసీఐ వారికే మిల్లుల వద్ద విక్రయించి మద్దతు ధర పేరుతో రూ. వందల కోట్లు ప్రభుత్వ సొమ్మును కాజేసిన విచారణ నివేదికన బహిరంగ పర్చాలన్నారు. పంట నాణ్యతా లోపాలకు ప్రకృతి వైపరీత్యాలే కారణం కానీ రైతులు ఎంత మాత్రం కాదు అలాంటప్పుడు రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని చందర్‌రావు ప్రశ్నించారు. పత్తి మొక్కజొన్నలను మద్దతు ధరల ప్రకారం మొత్తం పంటలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని చందర్‌రావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు బాషిపాక రమేశ్, సహాయ కార్యదర్శి గోనె కుమారస్వామి, కోశాధికారి కూస సంపత్ కుమార్, జిల్లా నాయకులు బల్నూకూరి నరసయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్ కిశోర్‌పై చర్య తీసుకోవాలి

- డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్

హన్మకొండ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మనువాద లాయర్ రాకేశ్ కిశోర్ దాడికి యత్నించిన అతనిపై చర్య తీసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు కొమ్ముల కరుణాకర్ డిమాండ్ చేశారు. గవాయ్‌పై దాడికి యత్నించడాన్ని యావత్ భారతదేశం సిగ్గుతో తలదించుకోవాలని, సాక్షాత్తు సుప్రీంకోర్టులో సైతం కుల రక్కసి తాండవిస్తూ బుసలు కొడుతున్న వైనాన్ని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించాలని వారు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. మనువాదాన్ని దేశంలో రోజురోజుకు ప్రేరేపించే విధంగా కొంత మంది మనిషి రూపంలో ఉన్న విషనాగులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కేసు విచారిస్తుండగా రాకేశ్ కిశోర్ డయాస్ వద్దకు వెళ్లి షూ తీసి ఆయనపై విసిరేందుకు ప్రయత్నించడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. 79 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఇంకా దళితులపై దాడులు చేయించడం సరైంది కాదన్నారు. లాయర్ రాకేశ్ కిశోర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

సీజేఐపై దాడి అమానుషం

వరంగల్ లీగల్ : కేసు విచారణ సమయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడి చేయడం న్యాయవ్యవస్థపై దాడి అని, అమానుషమైన చర్యగా హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. దీనికి కారకుడైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నయీంనగర్ : వరంగల్ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 10, 11, 12 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర 23వ మహాసభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి.మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, పి.నాగరాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేశ్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో 22 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదని, ప్రభుత్వ విద్యారంగం ధ్వంసమైందన్నారు. నూతన జాతీయ విద్యా విధానంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించిన సంస్థలపై, వ్యక్తులపై, ఉద్యమకారులపై. జర్నలిస్టులపై ఫాసిస్ట్ చర్యలతో అణిచి వేస్తోందన్నారు. మహాసభల్లో విద్యార్థి ఉద్యమాన్ని మరింత పదునెక్కించడం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, శ్రీకాంత్, మస్తాన్, రాణాప్రతాప్, ప్రకాష్‌రాజ్, సూర్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు పుస్తకాల బహూకరణ



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పుస్తకాలు అందజేస్తున్న ప్రొఫెసర్ రామన్న

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన రామన్న తన వద్ద ఉన్న విలువైన కెమిస్ట్రీ పుస్తకాలను సోమవారం కళాశాలకు ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతికి అందజేశారు. ఈ పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయని ఆమె తెలిపారు కార్యక్రమంలో కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, ఫిరోజ్, రమేశ్, శ్రీదేవి, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ డిగ్రీ కళాశాలకు..


విద్యారణ్యపురి : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆంగ్ల విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్ రూ.10 వేలు విలువ చేసే పుస్తకాలను సోమవారం కాలేజీ లైబ్రరీకి బహూకరించారు. విద్యార్థులకు ,అధ్యాపకులకు ప్రయోజనకరంగాఉండే ఆయా ఆంగ్ల, తెలుగు భాషా పుస్తకాలను పలు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనాథ్, లైబ్రేరియన్ డాక్టర్ టి.భరత్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలోపు షాపులు బంద్

- కఠినంగా వ్యవహరిస్తున్న పోలీసులు

కాజీపేట : పట్టణంలో రాత్రి 11 గంటల లోపే రహదారుల వెంట ఉన్న షాపులను పోలీసులు బలవంతంగా మూసివేయిస్తున్నారు. అర్ధరాత్రి దాటితే యువకులు తాగి గొడవలకు దిగుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక సీఐ సుధాకర్‌రెడ్డితో పాటు సిబ్బంది సకాలంలో షాపులను మూసివేసి పోలీసులకు సహకరించాలని వ్యాపారులపై ఒత్తిడి చేస్తున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పోలీసులు బైక్‌లపై తిరుగుతున్న యువకులను ఆపి నిలదీస్తే టిఫిన్ చేయడం కోసమో, టీ తాగడానికో..బిర్యాని తినడానికో వచ్చినట్లు చెప్పి తప్పించుకుంటున్నట్లు భావిస్తున్నారు. కాజీపేటలో రైల్వే జంక్షన్ ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు కాలనీల్లో చొరబడి తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి సొమ్ములు, నగదుతో పరారవుతున్నట్లుగా క్రైం పోలీసులు భావిస్తున్నారు. నిర్దేశించిన సమయం దాటిన తర్వాత పట్టణంలో సంచరిస్తే అనుమానితులను ఆపి సోదాలు నిర్వహించడం సునాయసంగా ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల రాత్రి వేళల్లో రౌండ్‌కు వచ్చిన ఏసీపీ స్థాయి అధికారి పట్టణానికి వచ్చే సరికి చిరు వ్యాపారులు హడావిడిగా దుకాణాలను మూసివేసి లైట్లను ఆఫ్ చేశారు. ఇదంతా నాటకంగా భావించిన సదరు అధికారి ఫాతిమానగర్ వైపు వెళ్లినట్లుగా వెళ్లి తిరిగి రావడంతో చిరువ్యాపారులు యథావిధిగా వ్యాపాలు చేసుకుంటున్నారు. అప్పుడే కొంత మంది యువకులు చిన్న విషయానికే గొడవ పడుతండటాన్ని గమనించి సీరియస్ అయినట్లుగా ప్రచారం సాగుతోంది. దీంతో అధికారులు సూచించిన సమయానికి దుకాణాలు బంద్ చేసేలా చర్యలు చేపడుతున్నారు.

బీజేపీలో చేరిక



హన్మకొండ : హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి సమక్షంలో స్కై విద్యా సంస్థల అధినేత మొర్రి కుమార్‌తో పాటు పలువురు బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సంతోశ్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో బీజేపీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు, ప్రధానంగా యువత బీజేపీ వైపు ఆకర్షితులవు తున్నారన్నారు. నడికూడ మండలానికి చెందిన యువకులు పార్టీలో చేరారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్, గురుమూర్తి శివకుమార్, నాను నాయక్, సంద్ర మధు, భరత్ గౌడ్, శ్రీనివాస్, అరణ్య, మురళి పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్

రామన్నపేట : పిల్లలకు ఆరోగ్య పరిరక్షణ కోసం మెరుగైన పౌష్టికాహారం అందించాలని భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ బాలల ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం సందర్భంగా రామన్నపేటలోని ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పిల్లలకు సమయపాలన పాటిస్తూ పోషక పదార్థాలలో కూడిన అహారం అందించాలన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ శ్రవణ్, రామలింగేశ్వరస్వామి అప్పరాజు, పద్మ పాల్గొన్నారు.